రేవంత్‌ను రెండు చోట్లా ఓడిస్తాం

- తెలంగాణ ఆటో మోటార్ డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ ఏకగ్రీవ తీర్మానం

మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డికి తీర్మాన పత్రం అందజేస్తున్న తెలంగాణ ఆటో మోటార్స్ డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ నేతలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): సీఎం కేసీఆర్‌పై పోటీ చేసే అర్హతలేని రేవంత్‌రెడ్డిని రెండుచోట్లా ఓడిస్తామని తెలంగాణ ఆటో మోటార్స్ డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ ఏకగ్రీవ తీర్మానం చేసింది. రేవంత్‌ను అసెంబ్లీ మెట్లు కూడా తాకకుండా బుద్ధి చెప్తామని శపథం చేసింది. శుక్రవారం కొడంగల్‌లో జరిగిన ఆటో కార్మికుల సమావేశంలో యూనియన్ నాయకులు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పట్నం నరేందర్ రెడ్డికి మద్దతుగా కార్మికవర్గం చేసిన ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందించారు. కార్మికుల సంక్షేమం కోసం దేశంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా సీఎం కేసీఆర్ పథకాలు తీసుకొచ్చి ఆదుకున్నారని యూనియన్ సభ్యులు చెప్పారు. డ్రైవరన్నలకు ఐదు లక్షల ప్రమాద బీమా, కరోనా కష్టకాలంలో రెండు త్రైమాసికాల వాహన పన్ను రద్దు చేసి కేసీఆర్ అండగా నిలిచారని చెప్పారు. కార్యక్రమంలో పట్నం మహేందర్‌రెడ్డి, యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య, కొడంగల్ నియోజకవర్గ జనరల్ సెక్రటరీ రాజశేఖర్, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు టీ రాజేందర్‌సింగ్, కామారెడ్డి నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న సినీ నటుడు గౌతమ్‌రాజ్

కళాకారులకు కేసీఆర్ ప్రోత్సాహం

- అన్నివర్గాల ఆపద్బాంధవుడు సీఎం
- బీఆర్ఎస్‌కే మా సంపూర్ణ మద్దతు
- సినీ నటులు చిట్టిబాబు, గౌతమ్‌రాజ్

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): తెలంగాణ భాష, యాసలకు ప్రాధాన్యమిచ్చి, కళాకారులను అమితంగా ప్రేమించి, ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రి దేశంలో కేసీఆర్ ఒక్కరేనని ప్రముఖ సినీ నటులు త్రిపురనేని చిట్టిబాబు, గౌతమ్‌రాజ్ ప్రశంసించారు. కేసీఆర్‌ను అన్ని వర్గాల ఆపద్బాంధవుడిగా కీర్తించారు. సుదీర్ఘకాలం పోరాడి సాధించిన తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తున్న సీఎం కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకి తాము సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు చెప్పారు. శనివారం తెలంగాణభవన్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ.. సాంస్కృతిక, కళారంగాలను అపూర్వంగా ఆదరిస్తున్న నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల ద్వారా తెలుగుభాష గొప్పతనాన్ని చాటి చెప్పి మాతృభాషకు అధిక ప్రాధాన్యం ఇచ్చారని గుర్తు చేశారు.

రెవెన్యూ.. రివర్స్

మొదటిపేజీ తరువాయి...

కాలం.. తదితర కాలమ్స్ అన్నీ తెస్తాం' అని భట్టి ప్రకటించారు. భట్టి మాటల అంతరార్థం మళ్లీ ధరణికి ముందు ఉన్న రెవెన్యూ వ్యవస్థను తెస్తామని. బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన రెవెన్యూ సంస్కరణలను మొత్తం ఎత్తివేస్తామని చెప్పకనే చెప్పారు.

మళ్లీ కయ్యాల కాలం

ఉమ్మడి రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థ అంటే ఒక పద్మవ్యూహం. రికార్డుల్లో ఉండే కాలమ్స్ గురించి ఆ శాఖలో పనిచేసే ఉద్యోగులకు, వాళ్లను అనుసరించి ఉండే దళారులకు తప్ప సామాన్యులకు తెలిసేవి కావు. చాంతాడంత రికార్డుల్లో ఎక్కడ ఏ వివరం ఉందో తెలుసుకోవటం సగటు పౌరుడికి దాదాపు అసాధ్యం.. ఆ సంక్లిష్టతను ఆధారంగా చేసుకొని దళారులు చెలరేగిపోయేవారు. చిన్న పనికి కూడా నెలలు, సంవత్సరాలు తిప్పించుకొని నరకయాతన పెట్టేవారు. నాడు రైతుల గోస వర్ణనాతీతం. రాత్రికి రాత్రే ఒకరి భూమి మరొకరి పేరుపై మారిపోయేది. మళ్లీ దాన్ని సంపాదించుకోవాలంటే లంచమైనా ఇవ్వాలి.. కోర్టుల చుట్టూ అయినా తిరగాలి. నాటి పరిస్థితి ఇది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ సంక్లిష్టతను తొలగించేందుకు రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని సీఎం కేసీఆర్ సంకల్పించారు. ఇందుకోసం మూడు నాలుగేండ్లపాటు కష్టపడ్డారు. ముందుగా భూ రికార్డులను ప్రక్షాళన చేశారు. ఆ తర్వాత అవినీతిమయమైన క్షేత్రస్థాయి రెవెన్యూ వ్యవస్థను రద్దుచేశారు. అంతిమంగా సంచలనాత్మక ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చారు. ఇది వచ్చిన తర్వాత భూ యజమాని అర్ధరాత్రి నిద్రలేచి కూడా ఐదు నిమిషాల్లో తన భూ రికార్డుల వివరాలను ఆన్‌లైన్‌లో చెక్‌చేసుకోవటం సుసాధ్యవుతున్నది. గంటలో భూ రిజిస్ట్రేషన్లు ముగుస్తున్నాయి. ధరణి పోర్టల్‌లో దేశవ్యాప్తంగా ఆసక్తి పెరిగింది. ఇలాంటి అద్భుత రెవెన్యూ సంస్కరణను ఇప్పుడు కాంగ్రెస్ తీసేస్తామని చెప్తున్నది. అంటే మళ్లీ గజిబిజి రికార్డులు, అర్థంకాని కాలమ్స్, బ్రహ్మపదార్థంలాంటి వ్యవస్థ తీసుకురాబోతున్నారు. స్పష్టంగా చెప్పాలంటే గత కాంగ్రెస్ పాలనలో ఉన్న పటేల్, పట్వార్వీ వ్యవస్థ మారుపేర్లతో రాబోతున్నది. మళ్లీ భూముల కోసం కయ్యాలు, కొట్లాటలు, గొడవలు మొదలు కాబోతున్నాయి. దళారులు రాజ్యమేలబోతున్నారు.

రైతుబంధు ఎవరికిస్తారు?

ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న రైతుబంధు నేరుగా భూ యజమాని ఖాతాలో పడుతున్నది. ఇప్పుడు కాంగ్రెస్ ధరణిని రద్దుచేస్తామంటున్నది. తన మ్యానిఫెస్టోలో కౌలురైతుకు నగదు ఇస్తామని ప్రకటించింది. ఆ డబ్బు రావాలంటే కౌలు రైతు తాను కౌలుకు తీసుకొన్న భూ యజమానితో చట్టప్రకారం ఒప్పందం చేసుకోవాలి. అప్పుడే అతడు కౌలు రైతుగా గుర్తింపు పొందుతాడు. సాధారణంగా తక్కువ మొత్తం భూమి ఉన్న రైతులు ఇతర రైతుల భూములను కౌలుకు తీసుకొని సాగుచేస్తుంటారు. అటు తన సొంతభూమితోపాటు, కౌలుకు తీసుకొన్న భూమిని కూడా సాగు చేస్తారు. ఈ పరిస్థితుల్లో కౌలురైతును ఎలా గుర్తిస్తారు? పోనీ భూమి లేని రైతులు ఇతరుల వద్ద కొంత భూమిని కౌలుకు తీసుకొని సాగుచేసుకొంటుంటారు. మరి రైతుబంధు ఎవరికి ఇస్తారు? భూ యజమానికా? కౌలు రైతుకా? ఒకటే భూమిపై ఇద్దరికీ ఇస్తారా? అది సాధ్యమవుతుందా? తన భూమిపై మరొకరికి రైతుబంధు (కాంగ్రెస్ దృష్టిలో మరో పేరు కావచ్చు) రావటాన్ని ఆ భూ యజమాని ఒప్పుకొంటాడా?

మొదటికే మోసం..

ఒక ఇంట్లో కిరాయికి ఉండే వ్యక్తి పేరు ఆ ఇంటిమీద రాస్తారా? అని కౌలు రైతులకు రైతుబంధు అంశంలో గతంలో సీఎం కేసీఆర్ ప్రశ్నించారు. అలాగే భూ యజమాని తన భూమి కౌలురైతు పేరుమీద రికార్డు కావటానికి ఒప్పుకొంటారా? సమస్య ఇంతటితో ఆగదు. భూ యజమాని తన భూమిని ఎల్లకాలం ఒకే కౌలురైతుకు ఇవ్వడు. ఏడాదికో.. రెండేండ్లకో మరొకరికి కౌలుకు ఇస్తాడు. అప్పుడు రైతుబంధు ఎవరికి ఇస్తారు? కౌలురైతు మారిన ప్రతిసారి తన భూమి రికార్డులు మార్చటానికి భూ యజమాని సిద్ధపడుతాడా? ఈ కచరా వ్యవహారం ఎందుకులే అనుకొని అసలు తన భూమిని ఎవరికీ కౌలుకు ఇవ్వకుండా పడావు పెడితే పరిస్థితి ఏంటి? వ్యవసాయం చేయాలన్నా భూమి దొరక్క కౌలు రైతులు విలవిలాడిపోరా? రెండుమూడేండ్లు కౌలుకు చేసిన రైతు.. ఆ భూమిపై నుంచి తొలగిపోనని పేచీ పెడితే పరిస్థితి ఏంటి? అంటే.. కాంగ్రెస్ తెబోయే భూ మాతతో వచ్చేవన్నీ కొట్లాటలు, తండ్లాటలే. వాటిని పరిష్కరించటానికి మళ్లీ కాంగ్రెస్ నేతలే దళారుల అవతారం ఎత్తి వసూళ్లకు తెరలేపుతారు. కాంగ్రెస్ అధికారం లోకి వస్తే జరుగబోయేది ఇదే..

కాంగ్రెస్ 'భూ'మంతర్!

- ధరణి పేరు మార్పే తప్ప కొత్తదనం లేని మ్యానిఫెస్టో
- కోనేరు రంగారావు కమిటీ సిఫారసులపై వింత భాష్యం
- మూడు నెలలకే 'భూమి డిక్లరేషన్'ను మరిచిన కాంగ్రెస్

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): 'ధరణిని బంగాళాఖాతంలో పడేస్తాం' అంటూ కాంగ్రెస్ పార్టీ గప్పాలు కొట్టడంతో భూ రికార్డుల నిర్వహణ, ఇతర అంశాలపై భారీ స్థాయిలో ప్రకటన ఏదైనా వస్తుందని, నూతన విధివిధానాలను ప్రకటిస్తారేమోనని ప్రజలు భావించారు. కానీ యథావిధిగా కాంగ్రెస్ పార్టీ తూచ్ అనేసింది. ధరణి స్థానంలో 'భూమాత' పోర్టల్‌ను ప్రవేశపెడుతామని చెప్పుకొచ్చింది. ఇది కొత్త పోర్టలా? లేక ధరణి పేరు మార్చుతారా? ధరణి కన్నా భిన్నంగా ఏం చేయబోతున్నారనేది మాత్రం చెప్పడం లేదు. ఉదాహరణకు.. ధరణికి ముందు రాష్ట్రంలో మా భూమి అనే పోర్టల్ అందుబాటులో ఉండేది. అందులోని రికార్డులను సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రక్షాళన చేసి, కొత్తగా ధరణి పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. ఇదే తరహాలో ధరణిని పక్కనబెట్టి, ఎలాంటి యంత్రాంగాన్ని అమలు చేస్తారు? ఇందుకు సంబంధించిన విధివిధానాలు ఏమిటి? అనేది మ్యానిఫెస్టోలో ఎక్కడా పొందుపరుచలేదు. కాంగ్రెస్ నేతలు సైతం వివరాలు చెప్పలేకపోతున్నారు. దీనిని బట్టి ధరణి పేరునే భూమాతగా మార్చుతారని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

- *ఈ ఏడాది జూలై 6న.. గాంధీభవన్‌లో 'భూమి డిక్లరేషన్' పేరిట 11 అంశాలతో ఓ భారీ ప్రకటన చేశారు. అయితే నాలుగు నెలల్లోనే భూమి డిక్లరేషన్‌ను కాంగ్రెస్ మరిచిపోయింది. శుక్రవారం విడుదల చేసిన మ్యానిఫెస్టోలో ఇతర డిక్లరేషన్లను ప్రస్తావించారే తప్ప 'భూమి డిక్లరేషన్' ప్రస్తావన లేదు. ఇచ్చిన హామీలను నాలుగు నెలల్లోనే మరిచిపోతే.. ఇక భూ సమస్యలు ఎలా పరిష్కరిస్తారని నిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.*
- *నిజామాబాద్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూ భారతి పైలట్ ప్రాజెక్టు ఎందుకు ఫెయిల్ అయ్యిందని ప్రశ్నిస్తున్నారు. భూమాతను సైతం ఇదే తరహాలో తెస్తారా? అంటూ సందేహం వ్యక్తంచేస్తున్నారు.*
- *కోనేరు రంగారావు కమిటీ సిఫారసులు అమలు చేస్తామని చెప్పడంపై భూ చట్టాల నిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ కమిటీ 2006లో రిపోర్ట్ ఇచ్చిందని గుర్తు చేస్తున్నారు. అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నదని, 8 ఏండ్లు కొనసాగిందని, మరి అప్పుడు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నిస్తున్నారు.*
- *ప్రభుత్వ భూములను కాపాడటానికి ల్యాండ్ కమిషన్ ఏర్పాటు చేస్తామని చెప్పడాన్ని కూడా నిపుణులు ఎద్దేవా చేస్తున్నారు. లా కమిషన్ మాదిరిగా భూముల నిర్వహణకు సంబంధించిన సలహాలు, సూచనలు ఇచ్చేలా ఉండాలని సూచిస్తున్నారు. ఇక రైతుల భూముల హక్కులు కాపాడేందుకు ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తామని చెప్పడం హాస్యాస్పదం అని, ట్రిబ్యునళ్లు భూ వివాద పరిష్కారానికి మాత్రమే పనిచేస్తాయని గుర్తు చేస్తున్నారు.*
- *అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వడంపై ఇప్పటికే సీఎం కేసీఆర్ అనేకసార్లు ప్రకటించారని, దానిని కాంగ్రెస్ కాపీ కొట్టిందని అంటున్నారు. మొత్తంగా మొదటి నుంచీ ధరణిని, భూ సమస్యలను బూచిగా చూపుతున్న కాంగ్రెస్ పార్టీ, ప్రత్యామ్నాయ ఎజెండాను ప్రజల ముందు ఉంచడంలో తీవ్రంగా విఫలమైందని స్పష్టం చేస్తున్నారు. 'భూమంతర్' అని మంత్రం వేస్తే అన్నీ మారిపోతాయి అన్నట్టుగా మ్యానిఫెస్టోలో పొంతన లేని హామీలు ఇచ్చి కిచిడీగా మార్చేసిందని ఎద్దేవా చేస్తున్నారు.*

కాంగ్రెస్ హామీల విలువ.. 3.5 లక్షల కోట్లు

- రాష్ట్ర బడ్జెట్ కన్నా లక్ష కోట్లు ఎక్కువ
- అదనపు నిధులు ఏడ తీసుకొస్తరు
- అధికారం కోసం అడ్డగోలు హామీలు
- ఆశ్చర్యపోతున్న ఆర్థిక నిపుణులు
- అధికారమిస్తే సగమూ అమలు కావు

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): తిమ్మిని బమ్మిచేసి.. ప్రజలను మభ్యపెట్టి, ప్రలోభాలకు గురిచేసి అధికారంలోకి రావాలనే దురాశ తప్ప.. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోలో గుప్పించిన హామీల అమలు ఎలా సాధ్యమన్న ఆలోచన ఆ పార్టీ నేతలకు లోపించిందని ఆర్థిక నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితితో నిమిత్తం లేకుండా ఉచితాలను, పథకాలను ప్రకటించడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టో హామీల అమలుకు రూ.3.50 లక్షల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్ రూ.2.77 లక్షల కోట్లు మాత్రమే. మరి కాంగ్రెస్ హామీలు అమలు చేయాలంటే అదనంగా మరో రూ.80వేల కోట్లు కావాలి. వీటికి అదనంగా ఉద్యోగుల వేతనాలు, ప్రభుత్వ ఖర్చులు తదితర వాటిని లెక్కిస్తే మొత్తంగా మరో రూ.2 లక్షల కోట్ల వరకు అప్పులు చేయాల్సి ఉంటుందని చెప్తున్నారు. చాంతాడంత జాబితా చూస్తుంటే ఇది అమలయ్యే పని కాదని అర్థం అవుతుదన్నదని అంటున్నారు.

హామీల అమలుకు కావాల్సిన నిధులు

- పెన్షన్ల పెంపునకు రూ.39 వేల కోట్లు
- ఇండ్ల నిర్మాణం పథకానికి 55 వేల కోట్లు
- దళితబంధు, 3కార్పొరేషన్లకు 45 వేల కోట్లు
- ఎస్టీలకు కేటాయింపులకు 28 వేల కోట్లు
- రుణమాఫీ, రైతు భరోసా, కౌలు రైతులు, కూలీలకు రూ.69 వేల కోట్లు
- మహిళా సంక్షేమానికి రూ.39 వేల కోట్లు
- తండాలకు ప్రత్యేక నిధులు 1,250 కోట్లు
- ఉద్యోగ కల్పన, జీతాలకు 6 వేల కోట్లు
- 200 యూనిట్ల ఉచిత విద్యుత్తుకు రూ.7,500 కోట్లు
- అమరులకు పెన్షన్‌కు రూ.36 కోట్లు
- విద్యార్థులకు సాయం రూ.2 వేల కోట్లు
- ఎలక్ట్రిక్ స్కూటర్లకు రూ.20 వేల కోట్లు
- ఇమాంలు, మౌజంలు, పాస్టర్ల గౌరవవేతనాలకు రూ.550 కోట్లు
- బీసీ సంక్షేమానికి రూ.20 వేల కోట్లు,
- రూరల్ యూత్ ఫైనాన్స్ కార్పొరేషన్ రూ.1000 కోట్లు
- మధ్యాహ్న భోజన కార్మికుల వేతనానికి రూ.650 కోట్లు
- రేషన్ డీలర్ల వేతనానికి రూ.100 కోట్లు
- ఉపాధి కూలీల వేతనాలు, పనిరోజుల పెంపుతో రూ.2 వేల కోట్లు
- ఆటో డ్రైవర్లకు రూ.720 కోట్లు,
- అంగన్‌వాడీ టీచర్లకు రూ.750 కోట్లు
- ఇతర హామీల అమలుకు 10 వేల కోట్లు

- సీహెచ్‌సీలో ఒకేరోజు 10 ప్రసవాలు

వరంగల్ జిల్లా వర్ధన్నపేట సీహెచ్‌సీలో శుక్రవారం ఒకే రోజు 6 సాధారణ, 4 సిజేరియన్ ద్వారా మొత్తం 10 ప్రసవాలు జరిగాయి. ఈ సందర్భంగా సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహస్వామి మాట్లాడుతూ దవాఖానలో మెరుగైన వైద్య సేవలు అందుతుండటంతో ప్రసవాల కోసం వచ్చే వారి సంఖ్య పెరిగిందని అన్నారు. - వర్ధన్నపేట

కాంగ్రెస్‌ది 420 మ్యానిఫెస్టో

- వారి గ్యారెంటీలను ప్రజలు నమ్మరు
- విద్యుత్తు శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

శుక్రవారం సూర్యాపేటలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు చొక్కయ్యకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ)/సూర్యాపేట టౌన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నిసార్లు మార్చినా అది ప్రజల దృష్టిలో 420 మ్యానిఫెస్టోనే తప్ప మరోటి కాదని విద్యుత్తు శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయా సంఘాలు, మహిళలు, యువకులు బీఆర్ఎస్‌కు పూర్తి మద్దతు ప్రకటిస్తూ నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాలతోపాటు మీడియాతోనూ మంత్రి మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్ ఎంత? ఆదాయ వనరులు ఏమిటి? పథకాలు అమలు చేస్తే అయ్యే ఖర్చు ఎంత? అనే విషయాలను ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోకుండా, ఎలాగైనా అధికారంలోకి రావాలనే దురాశతో కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోను రూపొందించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్, టీడీపీ కూటమిని ప్రజలు దోపిడీ దొంగల ముఠాగా భావిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని ఉత్తమ్, కోమటిరెడ్డి, జానారెడ్డి వంటి వృద్ధ నాయకులను ఈ ఎన్నికల్లో ప్రజలు ఘోరంగా ఓడించబోతున్నారని జోస్యం చెప్పారు. కేసీఆర్ ఉన్నంత కాలం తెలంగాణకు తిరుగులేదని అన్నారు. అనంతరం జన సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తగుళ్ల జనార్దన్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు బంటు చొక్కయ్యతోపాటు 250 మంది అనుచరులు, అలాగే బొల్లె అక్షయ్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్ఎస్‌యూఐ, ఏబీవీపీలకు చెందిన 630 మంది యువకులు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

ప్రచారంలో భాగంగా నమూనా బ్యాలెట్‌ను చూపుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే కష్టాలే

- ఏం చేశారని అవకాశమివ్వాలి
- ఓట్లడిగే కాంగ్రెసోళ్లను నిలదీయాలి
- ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్‌టౌన్/పాలమూరు, నవంబర్ 17 : పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలు కొని తెచ్చుకున్నట్టేనని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాల్‌సాహెబ్ గుట్ట పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం వాకర్స్‌తో ముచ్చటించారు. చిన్నారులతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. అలాగే మహబూబ్‌నగర్ రూరల్ మండలంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా కేసీఆర్ అర్బన్ ఎకో పార్కును అభివృద్ధి చేశామని తెలిపారు. చుట్టు పక్కల రహదారులు, కంపెనీలు ఏర్పాటుతో మహబూబ్‌నగర్ పట్టణ రూపురేఖలు మారిపోయినట్టు చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో తాగునీటి కోసం పడిన కష్టాలను గుర్తు తెచ్చుకుంటే ఎవరికి ఓటేయాలనే విషయం తెలుస్తుందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో తాగునీటి కోసం బోరింగ్‌ల వద్ద క్యూలైన్లలో వేచి ఉండే పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. నేడు మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటివద్దకే స్వచ్ఛమైన తాగునీరు అందుతున్నదని తెలిపారు. గ్రామాలకు వచ్చే కాంగ్రెస్, బీజేపీ నాయకులను నిలదీసి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం మహబూబ్‌నగర్ రూరల్ మండలం కోడూరు గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకునూరి మురళి మాట్లాడుతుండగా అడ్డుకుంటున్న గిరిజన మహిళ

సీఎం కేసీఆర్‌పై మాట్లాడే హక్కులేదు

- నీదేం పార్టీ.. ఎందుకొచ్చావ్?
- బీఆర్ఎస్‌పై విమర్శలు చేయొద్దు
- పెద్దవంగరలో మాజీ ఐఏఎస్ మురళిని అడ్డుకున్న గిరిజన మహిళ

పెద్దవంగర, నవంబర్ 17: 'నీదేం పార్టీ.. ఇక్కడికొచ్చి సీఎం కేసీఆర్, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీఆర్ఎస్‌ను విమర్శిస్తున్నావ్? నీకు వారి గురించి మాట్లాడే హక్కు లేదు' అని ఓ గిరిజన మహిళ మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళిని నిలదీసింది. జాగో తెలంగాణ ఓటరు చైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం ఆకునూరి మురళి మహబూబాబాద్ జిల్లా పెద్దవంగరకు వచ్చారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, మంత్రి దయాకర్‌రావును విమర్శిస్తూ మాట్లాడుతుండగా ధరావత్ బుజ్జమ్మ ఆయన్ని నిలదీసింది. 'నీదేం పార్టీ? నువ్వు ఇక్కడ ఏం చేసినవ్? మాలాంటోళ్లకు కేసీఆర్ ప్రభుత్వం అన్ని కల్పిస్తున్నది. బీఆర్ఎస్‌కు ఓట్లు వేయొద్దని ఎందుకు అంటావ్? అని ప్రశ్నించింది. మురళితో పాటు యాత్రకు వచ్చిన కొంతమంది పక్కనే ఉండి దయాకర్‌రావు దగ్గర డబ్బులు తీసుకొని వచ్చి మాట్లాడుతున్నావా? అంటూ మహిళను ప్రశ్నించారు. వారితో వచ్చిన వారు సదరు మహిళను అక్కడ నుంచి పంపిచే ప్రయత్నం చేస్తుండగా... 'కేసీఆర్‌ను, దయాకర్‌రావును అంటుళ్లంటే.. మీరే పెద్ద దొంగలు' అని ఎదురు తిరిగింది. స్థానికులు సైతం ఆ మహిళతో గొంతు కలిపారు. మాజీ ఐఏఎస్ అధికారి అయి ఉండి కూడా ఓటర్ల చైతన్య యాత్ర పేరుతో బీఆర్ఎస్, బీజేపీకి ఓట్లు వేయొద్దనడం, కల్వకుంట్ల కుటుంబాన్ని, బీజేపీని విమర్శించడం సిగ్గు చేటన్నారు. అలా మాట్లాడటం కంటే ప్రత్యక్షంగా కాంగ్రెస్ కండువా కప్పుకొని ఆ పార్టీకి ఓటు వేయండి అని ప్రచారం చేస్తే బాగుండేదని వారు మండిపడ్డారు. స్థానికులు నిలదీయడంతో మురళితో సహా బృంద సభ్యులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

చందూర్ మండలంలోని కారేగాంలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

కాంగ్రెస్, బీజేపీ మాయమాటలు నమ్మొద్దు

- వారికి ఓటేస్తే మళ్లీ అంధకారమే
- స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

చందూర్, నవంబర్ 17 : కాంగ్రెస్, బీజేపీ నేతల మాయమాటల్లో పడొద్దని.. వాళ్లకు ఓటేస్తే మళ్లీ అంధకారమేనని బాన్సువాడ బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా చందూర్ మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. అవినీతికి పాల్పడిన నాయకులకు ఓటు వేయొద్దని సూచించారు. ఎల్లారెడ్డి నుంచి వచ్చిన ఏనుగు రవీందర్‌రెడ్డి సొంత నియోజకవర్గ ప్రజల కోసం ఏమీ చేయలేకపోయాడని.. దీంతో అక్కడి ప్రజలు తిరస్కరించినట్టు చెప్పారు. తనను మళ్లీ ఆశీర్వదించి మరింత అభివృద్ధి చేయించుకోవాలని కోరారు.

కాంగ్రెస్ ప్రచారం అడ్డగింత

- అలంపూర్ కాంగ్రెస్ నాయకులను నిలదీసిన జిల్లెడదిన్నె గ్రామస్థులు

వడ్డేపల్లి, నవంబర్ 17: ఎన్నికల ప్రచారానికి వెళ్లిన కాంగ్రెస్ నాయకులను గ్రామస్థులు అడ్డుకున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం జిల్లెడదిన్నెకు అలంపూర్ కాంగ్రెస్ అభ్యర్థి సంపత్‌కుమార్ కుమారుడు దీపక్ ప్రచారానికి వెళ్లగా వాహనాన్ని అడ్డుకున్నారు. సంపత్‌కుమార్ ఎమ్మెల్యేగా ఉండి గ్రామానికి ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. దళితవాడకు దారి లేకపోవడంతో చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తున్నదని.. సమస్యను పరిష్కరించాలని అప్పట్లో సంపత్‌కుమార్‌కు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని విమర్శించారు. అందుకోసమే కాంగ్రెస్ నేతల ప్రచారం తమకు అవసరం లేదంటూ వారిని అక్కడినుంచి పంపించి వేశారు.

పాలకుర్తి మండలం వావిలాలలో కల్లు తాగుతున్న మంత్రి ఎర్రబెల్లి

మోసాల కాంగ్రెస్‌ను నమ్మొద్దు

- బీఆర్ఎస్ పాలనలోనే సమగ్రాభివృద్ధి
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి రూరల్, నవంబర్ 17: మోసాల కాంగ్రెస్‌ను నమ్మొద్దని బీఆర్ఎస్ పాలకుర్తి అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం జనగామ జిల్లా పాలకుర్తి మండలం వావిలాల, కొండాపురం, దర్దేపల్లి, వల్మిడి, మంచుప్పుల, చెన్నూరు, విస్నూరు, దళిత కాలనీ, లక్ష్మీనారాయణపురం గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారు. గ్రామాల్లో రోడ్డు షోలు నిర్వహించి, ఇంటింటి ప్రచారం చేశారు. ఓటర్లను కలిసి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఏం జరిగింది? కాంగ్రెస్ అరవై ఏండ్ల పాలనలో ఏం జరిగిందో ప్రజలు ఆలోచించాలని సూచించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బ్రోకర్ మాదిరిగా మాట్లాడుతూ మూడు గంటల కరెంట్ ఇస్తా అంటున్నాడని మండిపడ్డారు. కాంగ్రెస్ వస్తే సంక్షేమ పథకాలు బంద్ కావడం ఖాయమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఎన్నారై డాక్టర్ ఎర్రంరెడ్డి తిరుపతి పాల్గొన్నారు.

రైతుకు ఏం కావాల్నో రేవంత్‌కు తెలుసా?

- ఎన్నికల ప్రచారంలో మంత్రి వేముల

మోర్తాడ్/మెండోరా, నవంబర్ 17 : రైతుకు ఏం కావాల్నో తెలియని రేవంత్‌రెడ్డి ఏవేవో మాట్లాడుతున్నాడని బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్, మెండోరా మండలాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది హార్స్‌పవర్ పంపుసెట్లతో నీటిని పారించుకోవాలని రేవంత్ కొత్త పాట మొదలెట్టాడని విమర్శించారు.

తిమ్మాపూర్ మంత్రి వేములను గజమాలతో సన్మానిస్తున్న గ్రామస్థులు

కాంగ్రెస్ అభ్యర్థిని నిలదీసిన తండావాసులు

గూడూరు, నవంబర్ 17: మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి మురళీనాయక్‌కు చేదు అనుభవం ఎదురైంది. శుక్రవారం గూడూరు మండలం గుండెంగ పరిధిలోని గన్యచక్రుతండాలో ప్రచారం చేస్తూ.. ఎమ్మెల్యే శంకర్‌నాయక్ గ్రామానికి ఏం చేయలేదని విమర్శిస్తుండగా తండావాసులు అడ్డుకొన్నారు. 'గ్రామానికి మీరేం అభివృద్ధి చేయలేదు. శంకర్‌నాయక్ హయాంలోనే మా గ్రామానికి ఈ పదేండ్లలో రోడ్లు వచ్చాయి. కరెంటు, రైతుబంధు, సాగు, తాగునీరు వచ్చింది' అని వారు గట్టిగా సమాధానం ఇవ్వడంతో తోకముడిచారు.